ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21 సంచిక : 8 ఏప్రియల్ 2016

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

03-03-2015
పోడూరు
07-03-2016
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 03-03-2016, పోడూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వాల్మీకిమహర్షి రామాయణం రచించాడు. నాలుగు వేదాల సారమే రామాయణం. రామాయణంతో సమానమైన గ్రంథం ఇంకోటి లేదు. మనలను రక్షించేది రామాయణం అని చెపుతారు. మనిషి బాగుపడాలి అంటే రామాయణం అధ్యయనం చేయాలి. మన కుటుంబం పట్ల, సమాజం పట్ల మనకు ఉన్న బాధ్యతలు ఏమిటి, ఎవరిపట్ల ఎలా ప్రవర్తించాలి అనేది రామయణంలో చెప్పినంత వివరంగా ఎక్కడా మనకు కనబడదు. రామాయణం అధ్యయనం చేయటం వలన మనకు యింద్రియనిగ్రహం వస్తుంది, మనోనిగ్రహం వస్తుంది, జీవితంలో మనం పొందవలసింది ఏమిటో మనకు తెలుస్తుంది. కొంతమంది జీవితం పొడుగునా రామనామాన్ని స్మరిస్తారు. గాంధీగారు చిన్నతనం మొదలు ప్రాణంపోయేవరకూ రామనామాన్ని స్మరిస్తూనే ఉన్నారు. ఆయన ఇష్టదైవం రాముడు, గమ్యం రాముడు. నువ్వు ధర్మానికి రక్షణగా ఉంటే, ధర్మంకూడా నీకు రక్షణగా ఉంటుంది అంటే నువ్వు ధర్మాన్ని కాపాడితే, ధర్మం నిన్ను కాపాడుతుంది అని వ్యాసులవారు చెప్పారు. ధర్మాన్ని ఆచరించి చూపించినవాడు రామచంద్రమూర్తి.

ఆంజనేయస్వామి బహుసుందరమూర్తి. ఆయన సౌందర్యం చూడటానికి మన రెండు కళ్ళు చాలవు, వెయ్యి కళ్ళు ఉండాలి. అంటే సౌందర్యమే వచ్చి ఆ రూపంలో భూమిమీద నడుస్తోందా అని మనకు అనిపిస్తుంది. అంత సుందరంగా షిరిడీలో నాకు స్వప్నంలో ఆంజనేయస్వామి దర్శనమిచ్చాడు. ఇది షిరిడీ సాయిబాబా క్షేత్రం, నువ్వు

దర్శనమిస్తున్నావు ఏమిటి అని నేను హనుమంతుడిని అడిగాను. తరువాత అదే కలలో సాయిబాబా ఏమన్నారు అంటే నా మూలం నీకు దర్శనమిచ్చింది, అది నీకు సంతృప్తి లేదు. నేను కేవలం ఉత్సవమూర్తినే, మూలం ఆంజనేయస్వామి అని బాబాగారు చెప్పారు. వాయువుకు ఎంతబలం ఉంటుందో ఆంజనేయస్వామికి అంత బలం ఉంటుంది. అంతబలం ఉన్నాకాని ఆయన వినయవంతుడు. బలాన్ని సద్వినియోగం చేసాడు కానీ దుర్వినియోగం చేయలేదు. మనం రాముడిని గమ్యంగా పెట్టుకోవాలి, హనుమంతుడిని అనుసరించాలి. అంటే ఆచరణలో హనుమంతుడిని ఆదర్శంగా పెట్టుకోవాలి. మనం ప్రతీది స్వార్థంతో పనిచేస్తూ ఉంటే మనకు పునర్జన్మలు పెరుగుతాయి. ఆంజనేయస్వామిలో మనకు ఎక్కడా స్వార్థం కనబడదు. రామాయణం పొడుగునా ఎక్కడా స్వార్థం లేకుండా పనిచేసినవాడు ఆంజనేయస్వామి. అందుచేత రాముడంతటి వాడికి ఆంజనేయస్వామికి ఏమి ప్రజంట్ చేయాలో తెలియక ఆప్యాయతతో వెళ్ళి ఆంజనేయస్వామిని కౌగిలించుకొన్నాడు.

కొంతమంది మాట్లాడుతూ ఉంటే వినేకొలదీ మనకు వినాలని ఉంటుంది. వారు చెప్పే విషయం మనకు స్పష్టంగా చెపుతారు. అది చాలా మధురంగాను ఉంటుంది. రమణగ్రంథాలు కానీ, ఇతర గ్రంథాలుకానీ మీరు చదివేటప్పుడు దాని తాలూక స్పష్టత మీ మెదడులో ఉండాలి. అవి మాటలుకాదు, ఆదేశాలు. ఇలా చెయ్యండి అని ఆదేశిస్తుంది. నువ్వు ధర్మమును ఆచరించవలెను అనేది సలహాకాదు, అది ఆదేశమే. తాత్కాలిక ప్రయోజనాలకోసం ధర్మాన్ని విడిచిపెట్టవద్దు. రామకృష్ణుడి తండ్రి పేదరికం అనుభవించాడు కానీ ఎప్పడూ ధర్మాన్ని విడిచి పెట్టలేదు. రామకృష్ణుడి తండ్రి ఒకసారి గయలో రాత్రి గదాధరుడి గుడిలో నిద్రపోయాడు. గదాధరుడు ఆయనకు స్వప్నంలో వచ్చి నీవు బీదవాడివే అయినా నీ ప్రవర్తనలో ఎక్కడా దోషంలేదు. నీ ప్రవర్తన నాకు నచ్చింది. నీ ఆచరణను మెచ్చుకొని నేను మీ యింటికి వస్తాను అని గదాధరుడు చెపితే నువ్వు మా యింటికి రావద్దు, నిన్ను పోషించడానికి మేము మహారాజులము కాదు, నీకు సరైన భోజనం కూడా నేను పెట్టలేను, అందుచేత దయవుంచి నువ్వు మా యింటికి రావద్దు అని స్పష్టంగా రామకృష్ణుడి తండ్రి చెప్పాడు. అప్పడు నువ్వు అన్నం తింటున్నావా అని గదాధరుడు రామకృష్ణుడి తండ్రిని అడిగాడు. నేను తింటున్నాను అని చెప్పాడు. నువ్వు తిన్నదే నాకూ పెట్టు, నువ్వు కట్టుకొనే బట్టలే నాకు కూడా కుట్టించు, అంతకంటే నాకు అదనంగా ఏమీ అక్కరలేదు. అందుచేత నీకు ఇష్టం ఉన్నా, ఇష్టంలేకపోయినా నీ యింటికి వచ్చేస్తున్నాను అని చెప్పాడు. అలా చెప్పి మహావిష్ణువే

రామకృష్ణుడిగా వచ్చాడు. అది ధర్మంయొక్క ఆచరణలో ఉన్న గొప్పతనం.

శ్రీరాముడిది రఘువంశం. రఘువంశాన్ని కాళిదాసు వ్రాసాడు. అందులో ఒకరు లవకుశులతో మాట్లాడుతూ మీరు ఈ పొరపాటు చేసారా అని వారిని అడిగాడు. అప్పడు లవకుశులు ఏమన్నారు అంటే అసలు ఆ అనుమానం మీకు ఎందుకు వస్తోంది. మీరు ఈ పొరపాటు చేసారా అని మమ్మల్ని అడుగుతున్నారు ఏమిటి? రఘువంశంలో పుట్టినవాళ్ళు ఎవరయినా ఇంతవరకూ ఒక్క పొరపాటు చేసారా? మేము రఘువంశంలో పుట్టామని మీకు తెలియదా అన్నారు. లవకుశులు చెప్పిన ఈ మాట నాకు ఆశ్చర్యం కలిగించింది. మీరు రక్షింపబడాలి అంటే రామాయణం చదవండి అని చెపుతారు. మనచుట్టూ సమాజం ఉంది. సమాజంతో సంబంధం లేకుండా మనిషి బతకలేడు. అందుచేత సమాజం పట్ల మనకు ఉన్న ఋణం తీర్చుకోవాలి. ఇప్పడు మనం ఏదయినా అభివృద్ధిలోనికి వచ్చాము అనుకోండి. దానికి సమాజం సహకారం కూడా ఉంది. సమాజం దగ్గరనుండి మనం ఏదయినా పొందితే, ఇదంతా సమాజ సహకారంలో నుండి వచ్చిందని, మరల మనం సమాజానికి ఇవ్వాలి. సమాజం వలన మనకు రూపాయి వస్తే అందులో కొంతభాగం అయినా తిరిగి సమాజానికి ఇవ్వాలి. సమాజంతో సంబంధం లేకుండా మొత్తం అంతా వీడే తినేస్తే వాడు దొంగ. ఇటువంటి ధర్మాలు అన్నీమీరు తెలుసుకోవాలి అంటే రామాయణం అధ్యయనం చెయ్యండి.

చూసి రమ్మంటే కాల్చి వచ్చాడు అని ఈ సామెతలన్నీ ఆంజనేయస్వామినుండి వచ్చాయి. సీతమ్మ అక్కడ ఉందేమో చూసి రమ్మంటే లంకను కాల్చివచ్చాడు. అలా ఎందుకు చేసాడు అంటే వానరసైన్యంలో ఉన్న నాకే ఇంతశక్తి ఉంటే మిగతా సైన్యానికి ఎంతశక్తి ఉంటుందో, ఒకసారి రావణాసురుడికి రుచి చూపించటానికి అలా చేసాడు. మీరు రామాయణం చదివినా దాని మీద మీకు ఆకర్షణ కలగటం లేదు అనుకోండి, ఇష్టం కలగటం లేదు అనుకోండి, దానికి మీలో ఉన్న అలవాట్లుకారణం. మన అలవాట్లు, మనలో ఉన్న వాసనలు సరిగా లేకపోతే రామాయణం మనకు రుచిగా అనిపించదు. రామాయణంలోని కొన్ని మాటలు అలా గుర్తుకు వస్తూ ఉంటాయి. లక్ష్మణా! సీతలాంటి భార్య దొరుకుతుంది కానీ నీలాంటి సోదరుడు దొరకుతాడా అంటాడు రాముడు. అలాగే జటాయువు యు ఆర్ మై సెకండ్ ఫాదర్ అంటాడు. నువ్వు నాకు తండ్రివి, ఆ తండ్రి నాకు శరీరాన్ని ఇచ్చాడు, నువ్వు నాకోసం నీ ప్రాణం ఇచ్చావు. శరీరాన్ని యిచ్చినవాడు గొప్పవాడా, ప్రాణాన్ని ఇచ్చిన వాడు గొప్పవాడా. మహాత్ములు, మహర్షులు, పెద్దపెద్ద తపస్సులు చేసినవారు ఏ వైకుంఠానికి వెళుతున్నారో, ఏ

లోకానికి వెళుతున్నారో ఓ జటాయువు నువ్వుకూడా అటువంటి లోకానికి వెళ్ళు. ఇది రాముడి ఆజ్ఞ అంటాడు. రాముడిని మర్యాద పురుషోత్తముడు అంటారు. ఎక్కడ ఎలా మాట్లాడాలి, ఎక్కడ ఎలా ప్రవర్తించాలి, అనేది తెలిసినవాడు రామచంద్రమూర్తి, అందుచేత ఆయనకు మర్యాద పురుషోత్తముడు అని పేరు. మనం రాముడిని చూడటం కాదు, రాముడి చేత మనం చూడబడాలి అంటాడు వాల్మీకి.

మీకు ఈశ్వరుడి పట్ల నిజమైన విశ్వాసం ఉంటే కొండలు కూడా కరుగుతాయి అంటే విశ్వాసానికి అంత శక్తి ఉంది. మనకు భగవంతుడి పట్ల విశ్వాసం ఉంటే అసాధ్యం కూడా సాధ్యమౌతుంది. నీకు ఆత్మవిశ్వాసం ఉన్నప్పుడు చాలా క్వయిట్‌గా, కూల్‌గా ఉంటావు. మనకు ఆంజనేయస్వామి ఆదర్శం. ఆయన ఏ పనిచేసినా సేవాభావం తోటి చేసాడు. ఆయన ముఖంలో ఎప్పుడూ అవినయం లేదు. ఆంజనేయస్వామికి రాముడి పట్ల విశ్వాసం ఎప్పుడూ చెదరలేదు. ఎప్పుడూ రాముడికి అంకితభావంతో ఉన్నాడు. చాలామంది ఫలితాలకోసం, కోరికలు నెరవేరటం కోసం ఎక్కువగా ఆంజనేయస్వామిని ఆరాధిస్తారు. బుద్ధుడిది అంతా హేతువాదం. బుద్ధుడి యొక్క హేతువాదం ఎటువంటిది అంటే నువ్వు మూఢనమ్మకాలకు, మూఢాచారాలకు వెళ్లకుండా నీ స్వరూపం నువ్వు తెలుసుకోవటానికే హేతువాదం ఉపయోగించాడు. నిజంకానిదానిని నువ్వు నిజం అనుకొంటున్నావు అనుకో, నువ్వు అనుకునేది నిజంకాదు అని నీకు చెప్పటానికి హేతువాదం ఉపయోగించాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-03-2016 , జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈశ్వరుడు అంటే ప్రభువు, ఈ సృష్టికి యజమాని ఆయనే. ఈ జీవకోటిని వారి కర్మానుసారం ఒక నియమబద్ధంగా నడుపుతాడు. ఈ జీవకోటి జీవితాలలో ఎప్పుడు ఏ సంఘటన జరగాలి అని నియమించేవాడు, ఈ ప్రకృతిని నియమించేవాడు ఈశ్వరుడే. మనకు రాబోయే జన్మలో కాశీలో జన్మించాలి అని ఉంది అనుకోండి, అది మన ఇష్టంకాదు. ఆ జీవుడి యొక్క కర్మానుసారం, ఆ మనిషిలో ఉన్న సంస్కారాలను బట్టి వాడికి ప్రాణం పోయే టైములో పునర్జన్మను నిర్ణయిస్తాడు. జనన, మరణాలను నియమించేవాడు ఈశ్వరుడే. మనకు పూర్తిగా వాసనాక్షయం అయినప్పుడు ఇంక దేహాలతో పనిలేదు, ఇంక పునర్జన్మ రాదు. చాడ్విక్‌గారు చెప్పిన మాట నాకు రోజూ గుర్తుకు వస్తుంది. భగవాన్ శరీరం బాగా నీరసించిపోయింది, శరీరం పడిపోవటానికి సిద్ధంగా ఉంది. ఆ పుండును ఎన్నిసార్లు కోసినా

తిరిగి వస్తోంది. భగవాన్ అయితే వైద్యం చెయ్యమనీ చెప్పేవారు కాదు, వద్దనీ చెప్పేవారుకాదు. ఎలా జరగవలసి ఉంటే అలా జరుగుతుంది అని న్యూట్రల్‌గా ఉండేవారు. ఒకసారి చాడ్విక్ డాక్టర్లతో ఏమన్నారు అంటే హౌ మెనీ టైమ్స్ యు కట్ హిజ్ బాడీ. ఆ శరీరం కృశించి పోయింది, దర్శనం యివ్వటానికి కూడా పనికిరాదు. శరీరం ఉండటానికి, పోవటానికి ఆయనకు అసలు భేదం అనేది లేదు. శరీరం ఉన్నా, ఉండకపోయినా ఆయన అస్థిత్వానికి భంగం లేదు. శరీరం పోయినా కూడా నేను ఉంటాను అన్న సంగతి ఆయనకు తెలుసు. అందుచేత శరీరం పోవటం వలన ఆయనకు వచ్చే నష్టం ఏమీలేదు. నరకలోకం అని, స్వర్గలోకం అని ప్రయాణాలు ఏమీ ఆయనకు ఉండవు. ఎందుచేతనంటే ఆ ప్రయాణాలు చేసేవాడు ఎప్పడో మరణించాడు. అటువంటప్పడు ఆ శరీరాన్ని ఉంచటానికి అన్ని ప్రయత్నాలు ఎందుకు, అన్నిసార్లు సర్జరీలు చేయటం ఎందుకు, ఆ శరీరాన్ని నేచురల్‌గా వెళ్ళిపోనివ్వండి ఆపరేషన్లు చెయ్యటం మానేస్తే మంచిది. అది ఏ పనిమీద వచ్చిందో ఆ పని చూసుకొని వెళ్ళిపోతుంది అన్నారు.

సర్వసాధారణంగా ముసలితనం వచ్చేటప్పటికి అందరికీ భయం వేస్తుంది. ఆ భయం వాడికి తెలుస్తూ ఉంటుంది కానీ అది మరణభయం అని వాడికి తెలియదు. ప్రతీవాడికి ఉండాలని ఉంటుంది. శరీరం పోయినా వాడు ఉంటాడు. శరీరం పోయినా ఏదైతే ఉంటుందో అది వీడికి అనుభవంలో లేదు. శరీరం పోయిన తరువాతకూడా ఏదయితే ఉంటుందో దానిని శరీరం ఉండగానే భగవాన్ తెలుసుకొన్నారు. బ్రహ్మం అంటే ఏమిటి అని ఒకరు అడిగారు. బ్రహ్మం అంటే ఉండటమే. బ్రహ్మం అంతటా వ్యాపించి ఉంది. అది లోపల ఉంది, బయట ఉంది. మనంలోపల ఉన్నాము, బయట లేము అని మనకు అనిపిస్తోంది దేహాన్ని నేను అనుకోవటం వలన ఈ లోపల, బయట అనే బుద్ధి వస్తోంది. దేహము నేను అనే బుద్ధి లేకపోతే లోపల లేదు, బయటలేదు. లోపల బయట అనే తేడా దేహబుద్ధి వలన వస్తోంది. దేహము నేను అనే తలంపే ఇలా లోపల, బయట అని విడదీస్తోంది. అంతటా ఉన్నదే నీ హృదయంలోనూ ఉంది. నీ హృదయంలో ఉన్న దానిని నువ్వు గుర్తిస్తే, నీ హృదయంలో ఉన్నదే అంతటా వ్యాపించి ఉందని నీకు అనుభవంలోనికి వస్తుంది. ఈ మాటలు అనవసరం. నువ్వు ఏ విషయం గురించి అయితే మాట్లాడుతున్నావో దాని తాలూకు అనుభవం నీకు ఉండాలి. అనుభవం లేకుండా నువ్వు మాట్లాడినా ఆ మాటలయొక్క ప్రభావం ఇతరుల మీద పడదు. అందుచేత నీ హృదయంలో ఏముందో నీకు తెలిస్తే, దాని తాలూకు అనుభవం

నువ్వు పొందితే అంతకంటే మించిన లాభం నీకు ఏమీ లేదు. మిగతా లౌకిక లాభాలు నువ్వు పొందినా అవి కేవలం స్వప్న సమానమే.

ఇప్పుడు నీకు నేను అనేటప్పటికి నీ దేహం స్ఫురిస్తోంది. నేను కూర్చున్నాను అంటావు, అంటే నేను కూర్చుందా? నీ శరీరం కూర్చుంది. శరీరం కూర్చుంటే నేను కూర్చున్నాను అని నువ్వు ఎలా అంటున్నావు అంటే శరీరమే నువ్వు అనుకొంటున్నావు కాబట్టి శరీరగతమైన నేను అలా అనుకొంటోంది. ఈ దేహగతమైన నేను ఉన్నంతకాలం అదృష్టాలు, దురదృష్టాలు, కష్టాలు, నష్టాలు, లాభాలూ తప్పవు. మీరు ఎన్ని యాత్రలు చేసినా దుఃఖం తప్పదు, మీరు ఎన్ని గ్రంధాలు చదివినా, మీకు ఎంత ఐశ్వర్యం ఉన్నా మీకు దుఃఖం వస్తూంటే వాటి వలన ప్రయోజనం ఏమిటి. మీకు అన్ని విధాల బాగుంది, బయట పరిస్థితులు అన్నీ బాగున్నాయి. అయినా కానీ మీకు దుఃఖం వస్తోంది. మీకు ఉన్న సంపదకానీ, మీ బంధువులుకానీ, స్నేహితులు కానీ ఎవరూ మీ దుఃఖాన్ని ఆపుచేయలేకపోతే అసలు ఆ సంపద వలన, బంధువులవలన, స్నేహితుల వలన ఏమిటి ప్రయోజనం. భగవాన్ చెప్పినా, బుద్ధుడు చెప్పినా నిన్ను దుఃఖస్పర్శ లేని స్థితికి తీసుకొనిపోవటానికే వారు ప్రయత్నం చేసారు. దుఃఖస్పర్శ లేనిదే బ్రహ్మం, అది నీ హృదయంలోనే ఉంది. అది నీకు అనుభవంలోనికి రావటంలేదు. నీ హృదయంలోనే బ్రహ్మం ఉన్నప్పటికీ అది నీకు అనుభవంలోనికి రాకపోవటానికి నీ దేహబుద్ధి, మనోబుద్ధి కారణం. అంటే నీ యొక్క అస్థిత్వం దేహానికి, మనస్సుకు పరిమితం చేసుకొంటున్నావు. నీ లోపల ఉన్న నిజం హద్దులు లేనిది, దాని అస్థిత్వానికి ఎప్పుడూ భంగంలేదు. నీ దేహానికి దానికి ఇసుమంతయు సంబంధంలేదు. అది నీ శరీరంలో ఒక భాగంకాదు. నీ శరీరం చనిపోయిన దానికి చావు ఏమీ లేదు. నీ రాగద్వేషాలతోటి, పుణ్యపాపాలతోటి, కర్మలతో సంబంధంలేకుండా నీ హృదయంలో ఒక సత్యవస్తువు స్వతంత్రంగా ఉంది. అది ఎలా ఉందో నువ్వు అలా ఉండగలిగితే ఇంక నీకు ఈ జపాలు, ధ్యానాలు, సాధనలు ఏమీ అక్కరలేదు.

గాఢనిద్రలో మీరు దేహంగా లేరు, మనస్సుగా లేరు, మగవాళ్ళకింద వేరు, ఆడవాళ్ళకింద లేరు, భూలోకమని, స్వర్గలోకమని ఏమీ లేదు. కానీ మీరు ఉన్నారా లేదా అంటే ఉన్నారు. ఆ ఉండటం అనేది ఈ సృష్టితోటి, జననమరణాలతోటి ఏమీ సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉన్నారు. కాని ఉన్నట్లు అక్కడ మీకు తెలియటంలేదు. రాత్రి మీరు ఎలా ఉన్నారో పగలు కూడా అలాగే ఉన్నారు. అయితే ఇక్కడ మీకు విషయాలు కమ్మేస్తున్నాయి, ఇక్కడ మీకు దేహబుద్ధి వస్తోంది. ఆ దేహబుద్ధి రాగానే లోపల ఉన్న వస్తువు తాలూకు ఎరుక మీకు

పోతోంది. నిద్రలో ఉన్న వస్తువు, ఇప్పుడు మెలుకవలో కూడా ఉంది. నిద్రలో నువ్వు సుఖంగా ఉన్నావు, శాంతిగా ఉన్నావు కానీ ఉన్నట్లు నీకు తెలియటంలేదు. పగలు నువ్వు ఉన్నావని నీకు తెలుస్తోంది కానీ సుఖంగా , శాంతిగా లేవు. గాఢనిద్రలో నీకు సుఖం ఉంది, ఎరుక లేదు. జాగ్రదవస్థలో మనం ఉన్నామని ఎరుక ఉంది కాని సుఖంలేదు. గాఢనిద్రలో ఉన్న సుఖం, జాగ్రదవస్థలో ఉన్న ఎరుక ఒకేసారి మనకు అనుభవంలోనికి రావాలి.

ఉన్న వస్తువు ఉన్నట్లుగా మనకు అవగాహన కావటంలేదు. ఎందుచేతనంటే మనం దేహానికి, మనస్సుకు పరిమితమై జీవిస్తున్నాము. ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకోవాలి అంటే సత్పురుషుల సహవాసం అవసరం, సజ్జనసాంగత్యం ఉండాలి. సత్యవస్తువు గురించి నువ్వు కొంత శ్రవణం చెయ్యాలి. అది కూడా దాని తాలూక అనుభవం ఉన్నవాడి దగ్గర శ్రవణం చేస్తే ఆ అనుభవం నీకు కూడా వస్తుంది. బ్రహ్మానుభవం నీకు కలగాలి అంటే బ్రహ్మం ఎంతో కొంత అనుభవంలో ఉన్నవాడు చెపుతూ ఉంటే అది నువ్వు శ్రవణం చెయ్యాలి. వాడు ఏదయితే లోపల అనుభవిస్తున్నాడో అది మీకు చెపుతాడు కాబట్టి మీ హృదయంలో ఉన్నది మీకు అనుభవంలోనికి రావటానికి అది మీకు సహకరిస్తుంది. గురువు చేసేది ఏమిటి అంటే మీ హృదయంలో ఉన్న దానినే మీకు ఎరుకలోనికి తీసుకొని వస్తాడు. ఒకసారి గాంధీగారు నెల్లూరు రెడ్డిగారిని అడిగారు. ఏమండీ రెడ్డిగారు మీరు రమణమహర్షి గారి దగ్గరకు తరచుగా వెళతారుకదా. ఆయనా మనలాంటి వాడే కదా. అందరిలోను ఏముందో ఆయనలోనూ అదే ఉందికదా. మనలో లేనిది ప్రత్యేకంగా ఆయనలో ఏమీలేదు కదా. అసలు ఆయనకు మనకు తేడా ఏముందని మీరు తరచుగా ఆయనను చూడడానికి వెళుతున్నారు అని అడిగారు. ఆయన గాంధీగారితో ఏమన్నారు అంటే ఆయన హృదయంలో ఏముందో అదే మన హృదయంలోనూ ఉంది, అయితే తేడా ఒకటి ఉంది. ఆయన హృదయంలో ఉన్నది ఏదో ఆయనకు తెలుసు. మన హృదయంలోనూ అదే ఉందికాని అది మనకు తెలియటంలేదు. ఇక్కడ తెలియటం, తెలియకపోవటం ఒక్కటే తేడా. అందుచేత మేము రమణమహర్షిని చూడడానికి వెళుతున్నాము అని చెపితే ఆ సమాధానానికి బాపూజీ కూడా సంతోషించారు. పుస్తకాలు చదివితే జ్ఞాని కాదు మన హృదయంలో ఏ వస్తువు అయితే ఉందో అది అనుభవంలో ఉన్నవాడు జ్ఞాని, అది అనుభవంలో లేకపోతే వాడు అజ్ఞాని. పుస్తకాలు చదవటం వలన పాండిత్యం వస్తుంది. శరణాగతి వల్ల, విచారణవల్ల వస్తువు, మనకు తెలియబడుతుంది.

ఒక ముస్లిమ్ తిరుచ్చుళిలో భగవాన్‌తో కలిసి మూడవ తరగతి చదువుకున్నాడు.

వాడు తరువాత పోలీస్ ఇన్స్పెక్టర్ అయ్యాడు. వాడు ఒక షాపులో కూర్చొంటే అక్కడ భగవాన్ పటం ఉంది, దాని దగ్గర అగరువత్తులు వెలిగించి ఉన్నాయి. వీడు మా తోటి చదువుకున్నాడు, అప్పుడు పారిపోయాడు, తరువాత విషయాలు నాకు తెలియదు, మీరు ఈ అబ్బాయిని పూజిస్తున్నారు ఏమిటి అని ఆ కొట్టువాడిని అడిగాడు. వీడు మీ తోటి చదువుకొన్న అబ్బాయికాదు. వాడు ఆ శరీరంలోనే చనిపోయి మరల ఆ శరీరంలోనే జన్మించాడు. అందుచేత ఆయన పూజార్హుడు. ఆయన తిరువణ్ణామలైలో రమణమహర్షి అనే పేరుతో ఉన్నారు అని చెప్పాడు. ఆ విషయం నాకు తెలియదు అని చెప్పి అప్పుడు ఆ ముస్లిం భగవాన్ని చూడడానికి వెళ్ళాడు. తిరువణ్ణామలైలో భగవాన్ను కలిసి మనం మూడవ తరగతి కలిసి చదువుకొన్నాము అని గుర్తు చెయ్యటం ప్రారంభించాడు. అవును నీ పేరు హుస్సేన్ కదా. నువ్వు వాలీబాల్ బాగా ఆడేవాడివి కదా అని చిన్నప్పడు సంఘటనలు భగవాన్ జ్ఞాపకం చేస్తూ ఆయనను దగ్గరగా కూర్చోబెట్టుకొని ఆయనతో గంటసేపు మాట్లాడారు. అంటే భగవాన్ ఎప్పడూ కామన్మేన్కు దూరం అవ్వలేదు. నాలో ఏదయినా ప్రత్యేకత ఉంది అని మీరు అనుకొంటే అది మీ అహంకారానికి గుర్తు.

బ్రాహ్మీస్థితిని ఎవడయితే పొందాడో వాడు అంతటా ఉంటాడు. శరీరం లేకపోయినా ఉంటాడు, శరీరం ఉన్నా ఉంటాడు. పెరుమాళ్ళు కొంతకాలం భగవాన్కు సేవ చేసాడు. ఆయనకు ఆశ్రమం పెత్తనం ఇవ్వలేదని భగవాన్ను తిడుతూ ఉండేవాడు. చివరకు ఆయనకు చనిపోయేరోజులు దగ్గరకు వచ్చాయి. అప్పడు పెరుమాళ్ళు భగవాన్ దగ్గరకు వచ్చి నేను మిమ్మల్ని చాలా తిట్టాను, అది మీకు తెలియకపోవచ్చు. ఇప్పడు నాకు ముసలితనం వచ్చింది, చనిపోయే రోజులు దగ్గరపడుతున్నాయి, నేను నరకానికి వెళతానేమో అని భయం వేస్తోంది అని భగవాన్తో చెప్పారు. నువ్వు నాకు మంచీ చేసావు, చెడ్డా చేసావు. అయితే చెడ్డ చేసేముందు నీకు ఆధ్యాత్మికమార్గం విడిచిపెట్టవద్దు అని కబురు పంపించాను, కాని నువ్వు విడిచిపెట్టేసావు. యిప్పడు నరకానికి వెళతాను అంటున్నావు. నరకంలోకూడా నేను ఉన్నాను కదా. నీ రక్షణకోసం అక్కడ కూడా నేను ఉన్నాను. అంటే ఉన్న వస్తువు ఏదో అంతటా వ్యాపించి ఉంటుంది. ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. ఒక కాలంలో ఉండి ఇంకోకాలంలో లేకపోతే, ఒకప్రాంతంలో ఉండి యింకో ప్రాంతంలో లేకపోతే అది సత్యం కాదు. హద్దులు ఉన్నది, పరిమితులు ఉన్నది ఏదీ సత్యం కాదు. దేహబుద్ధి వల్ల నువ్వు దేహానికి పరిమితమై ఉన్నాను అని అనుకొంటున్నావు. నీ హృదయం ఉన్నది అంతటా ఉంది, అది అన్ని కాలాలలోను

ఉంది, అది లేని చోటు అంటూ ఏమీ లేదు. అది లేని చోటు ఉంటే అది సత్యంకాదు. నా హృదయంలో ఏదో ఉందని నాకు తెలుస్తోంది, కాని అంతటా వ్యాపించి ఉన్నది నాకు తెలియటం లేదు అని అడిగితే దానికి దీనికి ఏమీ బేధం లేదు. ఇదీ నిజమే, అదీ నిజమే. అంతటా వ్యాపించి ఉన్న వస్తువే నీ హృదయంలో కూడా ఉంది. నీ హృదయంలో ఉన్నది నీకు అనుభవంలోనికి వస్తే, ఇదే అంతటా వ్యాపించి ఉంది, దానికి దీనికి ఏమీ భేదం లేదని అప్పుడు నీకు తెలుస్తుంది.

ఈ రోజు శివరాత్రి. అంటే శివుడు లింగరూపం ధరించిన రోజు. తొలిలింగం, ఆదిలింగం అరుణాచలం అని కొంతమంది చెపుతారు. లింగం అంటే గుర్తు, పరమేశ్వరుడు ఉన్నాడని గుర్తు. లింగానికి కాళ్ళు, చేతులు, కళ్ళు ఏమీ లేవు, దానిని పూజించటం ఏమిటి అని కొంతమంది అంటారు. అసలు భగవంతుడికి నామం లేదు, రూపంలేదు. పరమేశ్వరుడు నిరాకారుడు, నిర్గుణుడు. ఈ ప్రకృతి గుణాలతోటి కాని, ప్రకృతి ఆకారాలతోటి కాని ఆయనకు సంబంధం లేదు. మనం ఒక ఆకారంతో తాదాప్యం పొందుతున్నాము కాబట్టి ఆకారం లేని దానిని మనం పట్టుకోలేము. సాకారానికి, నిరాకారానికి మధ్యన పరమేశ్వరుడు లింగరూపం ధరించాడు. అది సాకారమా, నిరాకారమా అంటే అది సాకారం కాదు, నిరాకారం కాదు. సాకారం అని చెప్పటానికి కళ్ళు, చేతులు ఏమీ లేవు, అలాగని నిరాకారం అని చెప్పటానికి ఏదో ఆకారం కనిపిస్తోంది కదా! సాకారానికి, నిరాకారానికి మధ్యన లింగరూపం ఉంటుంది. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే గుర్తుకోసం ఆయన లింగరూపం ధరించాడు. ఈశ్వరుడు లింగరూపంలో అవతరించిన ఈ రాత్రిని మహాశివరాత్రి అని పిలుస్తారు.

చనిపోయాక మేము ఉండాలి, మేము ఉండాలి అని చాలామంది అనుకొంటారు. శరీరం చనిపోయాక మీరు ఉంటారు. మీరు ఎలాగయినా ఉంటారు కదా అటువంటప్పుడు ఇంకా ఉండాలి, ఉండాలి అనుకోవటం ఎందుకు. ఇప్పుడు మీరు జిన్నూరులో ఉన్నారు. మేము జిన్నూరులో ఉన్నాము, జిన్నూరులో ఉన్నాము అని అనుకోవటం ఎందుకు? ఎలాగూ జిన్నూరులో ఉన్నారు కదా. అలాగే మీ శరీరాలు చనిపోయాక మీరు ఉంటారు. అది మీకు తెలియకపోయినా ఉంటారు. ఇంక ఉంటాము, ఉంటాము అని అనుకోనక్కరలేదు. శరీరం చనిపోయాక కొంతమంది స్వర్గానికి వెళ్ళవచ్చు, కొంతమంది నరకానికి వెళ్ళవచ్చు, లేకపోతే మరో లోకానికి వెళ్ళవచ్చు. కానీ మీరు ఒకటి గుర్తుపెట్టుకోండి. ఆ వెళ్ళేవాడు అబద్ధం, అంతటా ఉన్నది ఒక్కటే సత్యం. ఒక లోకంలోనుండి ఇంకోలోకం లోనికి వెళ్ళేవాడు అబద్ధం. శరీరం

మరణించిన తరువాత ఎవడయితే ప్రయాణం చేస్తున్నాడో మీరు జీవితంలో సాధనలు చేసినా, సత్కర్మలు చేసినా పోగొట్టుకోవలసింది వాడినే. కాని వాడిని మనం ముస్తాబు చేస్తున్నాము. మీరు మంచి పనులు చేసినా మీ పేరు అందరికీ తెలిసిపోవాలి, మీరు మంచి పనులు చేస్తున్నట్లు అందరూ చెప్పకోవాలి అని అనుకొంటారు కదా. అంటే మీరు మంచి పనులు చేసినా వాడినే ముస్తాబు చేస్తున్నారు. అందుచేతనే మీ కుడిచెయ్యి చేసే పని ఎడమచేతికి తెలియకూడదు అని ఏసు చెప్పాడు. అందుచేత మీరు చేసేపని నిర్మలంగా, నిశ్చలంగా, ద్వైతబుద్ధి లేకుండా ప్రశాంతంగా చెయ్యండి. మీరు చేసే పని ఎలా ఉండాలి అంటే దాని వలన మీకు శాంతి కలగాలి, మీరు ఎవరికయితే సహాయం చేస్తున్నారో వాడు సుఖపడాలి. ఆ పని రజోగుణంగా ఉండకూడదు, సత్వగుణంగా ఉండాలి.

ప్రపంచం అంతా ఈశ్వరుడిదే. ఈ సృష్టిలో ప్రతీవస్తువూ ఆయనదే. మనం అన్నం తింటున్నాము అనుకోండి. ఇదంతా పరమేశ్వరుడిదే అనే భావన నీకు లోపల ఉండాలి. ఇది ఆయన ప్రసాదమే అనుకొని మనం తినాలికాని ఇది నా సొంతం అనుకొని తింటూఉంటే నువ్వు తినేది అన్నం కాదు, నువ్వు పాపం తింటున్నావు. ఈశ్వరుడి సొత్తు నీది ఎలా అవుతుంది. పరమేశ్వరుడి సొత్తును మనం అనుభవించవచ్చు కాని ఇది ఆయనదే అని తెలుసుండి అనుభవించాలి. అలా కాకుండా ఇది నాదే అనే భావనతో అనుభవిస్తే నువ్వు దొంగవు. ఇది ఆయనదే అని నీకు తెలిసి తింటే దాని వలన నీకు పాపం రాదు. మనం ఎవరికయినా ఏదయినా యిచ్చినా అదీ ఈశ్వరుడిదే, అది మన సొంతం కాదు. మనం ఊరికే నిమిత్తమాత్రం. మీ వల్ల ఏదయినా పని అయితే అది కూడా ఈశ్వరుడే చేసాడు. అది మీకు తెలియక ఈశ్వరుడు చేసిందే నేను చేసాను అని మీరు అనుకొంటున్నారు. అది ఈశ్వరుడే చేసాడు అనే అనుభవం మీకు లేదు కదా. అందుచేత ఆయన చేసి పెట్టిన పని కూడా నేను చేసాను అని మీకు అనిపిస్తుంది. దానిని బట్టి మరల అజ్ఞానం పెంచుకొంటారు. మీకు ఉద్రేకం వచ్చినా, అశాంతి వచ్చినా, దుఃఖం వచ్చినా ఏది వచ్చినా దానికి కారణం లోపల అజ్ఞానం ఉంది అని గుర్తు. చనిపోయి ఏదో మా వాళ్లు వైకుంఠానికి వెళ్లిపోయారు అని కొంతమంది అంటూ ఉంటారు. ఆ లోకాలకు వెళ్లేవాడు అబద్ధం. అది మనకు తెలియటం లేదు. వాడు నిజంకాదు, వాడు అబద్ధం అని మనకు తెలియాలి. నువ్వు విచారణ చేస్తే వాడు అబద్ధం అని నీకు తెలుస్తుంది. వాడు ఉన్నాడు అని అనుకొంటున్నావు కాబట్టి వెళుతున్నాడు. అసలు వాడు లేడు అని తెలిస్తే ఇంక ప్రయాణం ఏముంటుంది, ఇంక ప్రయాణం ఏమీ లేదు. అదే

భగవాన్ చెప్పారు. వీళ్ళందరూ నేను వెళ్ళిపోతున్నాను అంటున్నారు. ఎక్కడికి వెళ్ళిపోతాను. ఎక్కడికయినా వెళ్ళటానికి మనం లేనిచోటు అంటూ ఉండాలి కదా. అంతటా మనం ఉన్నప్పుడు ఇంక ఎక్కడికి వెళతాము. అప్పుడు ఇంక వెళ్ళేది లేదు, వచ్చేది లేదు అన్నారు భగవాన్. మీరు ఎవరికయినా ఏదయినా యిస్తే అది తిరిగి మనకు పరమేశ్వరుడు యిచ్చేస్తాడు. మీరు యితరులకు యిచ్చింది మీకే తిరిగి వచ్చేస్తుంది అని భగవాన్ కూడా చెప్పారు కదా. అలాగ ఒకవేళ వస్తేరానివ్వండి. అంతేకాని మనం వాళ్ళకు యిస్తే తిరిగి భగవంతుడు మనకు యిచ్చేస్తాడు అనే బుద్ధితోటి మీరు యిస్తే ఇంక మీ జీవుడు చావడు. మీకు ఫలితం రావచ్చు, దానిని అనుభవిస్తే కొంతకాలానికి అది పోతుంది. మీ జీవలక్షణాలు మటుకు పోవు. యివ్వటం, పుచ్చుకోవటం కాదు. ఇక్కడ మీ జీవలక్షణాలు నశించాలి, అది మెయిన్.

బుద్ధుడు వాసనాక్షయానికి టాప్‌మోస్ట్ ఇంపార్టెన్స్ యిచ్చాడు. లోకం గొడవలు లేవు, దేవుళ్ళు, దేవతలు, ప్రసాదాలు ఇటువంటి గొడవలు లేవు. నీకు వాసనలు ఉన్నాయా లేదా? వాసనలు ఉంటే వాటిని ఎలా తగ్గించుకోవాలి దాని గురించే జీవితం పొడుగునా బోధించాడు. నీకు వాసనాక్షయం అయిపోతే ఇంక జీవుడు ఎక్కడ ఉన్నాడు. వాసనలు అన్నీ పూర్తిగా క్షయమయిపోతే, నీకు ఒక్క వాసన కూడా లేదు అనుకో యింక నీకు దేహం రాదు. వాసనాక్షయం అయితే నువ్వు శరీరం ఉండగానే పూర్ణసుఖాన్ని పొందుతావు. అదే నిర్వాణం. వాసనాక్షయం అయినప్పుడు మాత్రమే అది నీకు సాధ్యమౌతుంది. ఈ దేహం చనిపోయిన తరువాత మనం ఉండము అని అందరికి భయం వేస్తోంది. అందుచేత దుఃఖపడుతున్నారు. ఇప్పుడు దేహం ఉనప్పుడు మీరు ఎలా ఉన్నారో, దేహం పోయిన తరువాత కూడా అలాగే ఉంటారు. ఉండటం అనేది సర్టినిటీ. కాని మీకు దేహబుద్ధి ఉన్నమూలంగా దేహంపోతే నేను పోతాను అని మీరు అనుకొంటున్నారు. దేహమే కనుక మీరు అయితే దేహంపోతే మీరూపోతారు. మీరు దేహానికి పరిమితమై లేరు. గాఢనిద్రలో మీకు ఎవరికైనా దేహభావన ఉందా? ఎవరికీ లేదు. దేహమే కనుక మీరు అయితే గాఢనిద్రలో కూడా దేహభావన మిమ్మల్ని విడిచిపెట్టకూడదు. ఇది కొండగుర్తు పెట్టుకోండి. గాఢనిద్ర మనకు గురువు. గాఢనిద్రలో మీకు లోకంగొడవకాని, కుటుంబంగొడవకాని, చుట్టాలగొడవగాని, దేవుడు గొడవ గాని ఏ గొడవ మీకు లేదు. అంటే వాడు కాని అన్ని విషయాలనుండి విడిపోతున్నాడు, కాని వాడు ఉంటాడు. గాఢనిద్రలో ఉన్న స్థితే మీకు వాసనాక్షయం అయినప్పుడు జాగ్రదవస్థలో

వచ్చేస్తుంది. జాగ్రదవస్థలో నీకు ఎరుక ఉంటుంది, సుఖం కూడా వచ్చేస్తుంది. అది నేను, ఇది నేను అని మనం అనుకొంటూ ఉంటాము కదా! గాఢనిద్రలో మీరు ఏదైతే కాదో వాటిలో నుండి బయటకు వచ్చేస్తారు. మీ అమ్మాయి అంటే మీకు ఇష్టం అనుకోండి, మరి గాఢనిద్రలో మీకు అమ్మాయి గొడవ ఉందా? ఏమీలేదు. అంటే గాఢనిద్రలో మీరుకాని దాంట్లోంచి బయటకు వచ్చేస్తారు, మీరు ఏదైతే అవునో అదిగా ఉంటారు. గాఢనిద్రలో జీవుడు సత్యానికి దగ్గరగా ఉంటాడు. అందుచేత వాడు సుఖంగా ఉంటాడు. నీకు తలంపులు వస్తూ ఉంటే నేను ఎవడను విచారణ అవసరమే లేకపోతే శరణాగతి కూడా మంచిదే. శరణాగతిలో నువ్వే ఉన్నావు నేను లేను అంటే ఈశ్వరుడే ఉన్నాడు, జీవుడు లేడు.

శరీరం అని, మనస్సు అని, బుద్ధి అని ఇలా మనం అనుకొంటున్నాము. శరీరము, మనస్సు, బుద్ధి ఈ మూడూ అనాత్మే. మనకు తెలివితేటలు ఉంటాయి, అదీ అనాత్మే. దీనికి ఆత్మకు ఏమీ సంబంధం లేదు. అయితే ఇవి మంచిగా ఉంటే సత్యాన్వేషణకు ఉపయోగ పడతాయి. అందుచేత వీటిని మంచిగా ఉంచాలి. మనకు కారు ఉన్నా అది కండిషన్‌లో లేనప్పుడు మనకు సుఖం ఉండదు. అలాగే శరీరం, మనస్సు, బుద్ధి మనం కాకపోయినా వాటిని కండిషన్‌లో పెట్టుకోవాలి. అవి కండిషన్‌లో ఉంటే లోపల ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి అవి సహకారం చేస్తాయి. ఇంకోటి మీరు జ్ఞాపకం పెట్టుకోండి. మీరు పూర్వజన్మలో ఏ పని అయితే ఎక్కువగా చేసారో ఆ పని తాలూక వాసన ఎక్కువగా వస్తూ ఉంటుంది. ఆ పని అయిపోయింది, ఆ శరీరం చనిపోయింది, కాని అది లోపల వాసన కింద పడిపోయింది. లోపలఉన్న వాసనే ఇప్పుడు నీకు తలంపు రూపంలో వస్తుంది. లోపలఉన్న వాసన మీకు తలంపు రూపంలో రాదు అనుకోండి ఆ వాసన మీలో ఉన్నట్లు కూడా మీకు తెలియదు. నువ్వు శరీరంకాదు, మనస్సుకాదు అని కొంతమంది చెపుతూ ఉంటారు. భగవాన్ టీచింగ్ ఏమిటి అంటే నేను శరీరాన్ని కాదు, నేను మనస్సునుకాదు అని నువ్వు ఏదైతే కాదో దానిని పదిసార్లు తలపెట్టుకోవటం ఎందుకు? అవి నువ్వు కాదు కదా! ఉన్నదానిని స్మరించటం మంచిది కాని లేనిదానిని స్మరించటం ఎందుకు? నువ్వు ఏదైతే అవునో దానిని స్మరిస్తూ ఉంటే ఈనాటికైనా, ముందునాటికైనా అది నీచేతికి అందుతుంది కాని ఇలా నువ్వు ఏదైతే కాదో దానిని స్మరించటం వలన నీకు ప్రయోజనం లేదు.

మీకు దుఃఖం ఒక తలంపు, సంతోషం ఒక తలంపు, భయం ఒక తలంపు. మీకు ఏ తలంపు వచ్చినా దాని వెనకాల నేను అనే తలంపు ఉంది. ఈ నేను అనే తలంపుకు ఇతర

తలంపులు వస్తాయి. మీకు ఏ తలంపు వచ్చినా దానికి దేహమే కారణం. దేహము నేను అనేది ఒక తలంపు. ఆ తలంపే ఇతర తలంపులకు కారణం అవుతుంది. ఏతలంపు వచ్చినా దేహము నేను అనే తలంపుకే వస్తున్నాయి. అయితే దేహము నేను అనే తలంపు నీకు ఎక్కడ నుండి వస్తోంది. అది నీ లోపల నుండే వస్తోంది కాని బయట నుండి రావటంలేదు. దానినే మిధ్యానేను అంటున్నారు. అది నిజంకాదు. నీచేత చెడ్డపనులు చేయించేది ఇదే. ఇది కూడా తలంపే. ఇది కూడా ఒక తలంపే కాబట్టి నీకు గాఢనిద్రలో అణిగిపోతుంది. ఈ నేను అనే తలంపును నువ్వు ఎవరవు అని ప్రశ్నించటం వలన అది కొంచెం లోపలకు జరుగుతుంది. ఈ నేను అనే తలంపు లోపలకు వెళ్ళేకొలది దానికి వచ్చే ఇతర తలంపులు ఆగిపోతాయి. ఈ నేను అనే తలంపుకు ఒక మూలం ఉంది, ఆ మూలంలోనే బ్రహ్మం ఉంది. ఈ నేను అనే తలంపు దాని మూలాన్ని అది చూసేవరకు లోపలకు గెంటాలి. నువ్వు మధ్యలో వచ్చేయకూడదు. మూలతలంపు మూలంలోనికి నువ్వు వెళ్ళగలగాలి అంటే నేను అనే తలంపును దాని మూలంలోనికి గెంటాలి. ఈ నేను అనే తలంపు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది. అప్పడు నీకు ఒక నేను వ్యక్తమవుతుంది. ఆ నేను దేహానికి పరిమితమైనది కాదు. లోపల ఉన్న బ్రహ్మమే అప్పడు నేనుగా వ్యక్తమవుతుంది. ఇప్పడు మనకు దేహమే నేనుగా వ్యక్తమవుతోంది. దేహబుద్ధి నశించేవరకు నీ హృదయంలో ఉన్న సత్యం నీకు ఎరుకలోనికి రాదు. నాకు ఆ దేవుడు కనిపించాడు, ఈ దేవుడు కనిపించాడు ఈ గోల వదిలేయండి. నీ హృదయంలో ఒక సత్యం ఉంది. నువ్వు జన్మలేని స్థితిని పొందాలి అంటే, నువ్వు స్వర్గరాజ్యాన్ని పొందాలి అంటే నీకు ఇష్టం ఉన్నా, ఇష్టంలేకపోయినా నీ హృదయంలో ఉన్న సత్యం నీకు ఎరుకలోనికి రావాలి. నువ్వు సత్యానుభవం పొందేవరకు ఈ పరిమితుల నుండి, జన్మపరంపరల నుండి విడుదల అయ్యే అవకాశం లేదు.

భగవాన్ సూత్రం ఏమిటి అంటే నువ్వు ఎలా ఉన్నావో అలా ఉండటం నేర్చుకో. మిగతావన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. నాది, నాది అంటాడు. ఈ శరీరమే నీది కానప్పడు ఇంక ఏది నీది అవుతుంది. నేను, నాది అనేవి కూడా తలంపులే. నేను అనే తలంపుకే నాది అనే తలంపు వస్తుంది. ఈ సృష్టిలో నీది అనుకొనేది ప్రతీదీ కూడా ఈశ్వరుడిదే. యజమాని ఆయనే. ఆయన సొత్తు నీది అనుకొంటే నువ్వు దొంగవు. అందుచేత నువ్వు ఏ పని చేసినా చిత్తశుద్ధి ఉండాలి. ఈ అన్వేషణ కూడా చిత్తశుద్ధితో చెయ్యాలి. చిత్తశుద్ధిలేని శివపూజ లేలయా అన్నాడు వేమన. కొంతమంది యాంత్రికంగా మాట్లాడతారు. అక్కడ

హృదయం ఉండదు, దానిలో ప్రేమ ఉండదు, ఆప్యాయత ఉండదు. వాడు మాట్లాడే మాటలు యాంత్రికంగా ఉన్నాయి కాబట్టి నీలో స్పందన ఏమీ కలగదు. అందుచేత చిత్తశుద్ధి ఉండాలి. ఈ నేను ఎవడను అని చేసే అన్వేషణలో కూడా చిత్తశుద్ధి ఉండాలి. మీరు ఇంకోటి జ్ఞాపకం ఉంచుకోండి. ఈ నేను ఎవడను అనే ప్రశ్న ఎందుకంటే ఈ నేను, నేను అనేది నువ్వు కాదు కాబట్టి ఈ ప్రశ్న వచ్చింది. అదే నువ్వు అయితే దానికి నేను ఎవడను అనే ప్రశ్న అక్కరలేదు. తుకారామ్ ఏమన్నాడు అంటే దేహము నేను అనే తలంపు నాకు పోయింది కాని నేను దాని గురించి అన్వేషణ ఏమీ చేయలేదు. గోదావరికి వరద వచ్చినప్పుడు పెద్ద పెద్ద వృక్షాలు ఎలా కొట్టుకొని పోతాయో అలాగే పాండురంగడిపట్ల ఆయనకు ఉన్న శరణాగతి వేగంలో ఈ దేహగతమైన నేను కొట్టుకొనిపోయింది. అది ఎప్పుడు కొట్టుకొనిపోయిందో నాకు తెలియదు కాని అది పోయిన తరువాత దేహగతమైన నేను పోయింది అని నాకు తెలిసింది. అది ఈశ్వర కటాక్షం. లోపల ఉన్న వస్తువుకు నామంలేదు, రూపంలేదు, గుణంలేదు. మంచిగుణాలు మనస్సులోవే, చెడ్డగుణాలు మనస్సులోవే. మనస్సు అణిగిపోతే అదీలేదు, ఇదీలేదు. అయితే మీరు సత్వగుణాన్ని ప్రాక్టీసుచేస్తే మనస్సు నెమ్మదిగా అణిగిపోతుంది. అందుచేత సత్వగుణాన్ని ప్రాక్టీసు చెయ్యాలి. నీకు తలంపులు వస్తూ ఉంటే అన్ని తలంపులు కూడా దుఃఖాన్ని తీసుకొని వస్తాయి. అందుచేత తలంపు ఎక్కడ పుడుతుందో అక్కడే దానిని ధ్వంసం చెయ్యటం మంచిది. ఆ తలంపు ఎక్కడైతే పుడుతోందో అక్కడ ధ్వంసం చెయ్యకుండా దానిని రిపీట్ చేస్తూ ఉంటే అది పెరిగిపోతుంది, ఆ వాసన పెరుగుతుంది, ఆ వాసనలు పునర్జన్మకి కారణం అవుతాయి.

నీ శరీరం మరణించేటప్పుడు అంటే ప్రాణం పోయే టైములో నీకు ఏ తలంపు అయితే గాఢంగా ఉందో ఆ తలంపును బట్టి మీకు పునర్జన్మ వస్తుంది. అయితే ప్రాణం విడిచిపెట్టేటప్పుడు నీకు రామ, కృష్ణ అని మంచి తలంపులు వస్తాయని నువ్వు అనుకోవద్దు. నువ్వు అనుకున్న తలంపులు రావు. నీ జీవితం పొడుగునా ఏ తలంపును ఎక్కువగా ఎంజాయ్ చేసావో, ఏ తలంపు అయితే నీకు బాగా ఇష్టమో అదే హృదయంలోనుండి శిరస్సులోనికి వస్తుంది. మీకు అనేక తలంపులు ఉండవచ్చు. ప్రాణ ప్రయాణ సమయంలో మీరు అనుకొన్న తలంపురాదు. జీవితం పొడుగునా ఏ తలంపుకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారో ఆ క్షణంలో అదే శిరస్సులోనికి వస్తుంది. మీకు ఎటువంటి శరీరం ఇవ్వాలి, ఏ కుటుంబంలో మీకు జన్మలు ఇవ్వాలి ఇవన్నీ అప్పడు నిర్ణయం అయిపోతాయి. కొంతమందికి వెంటనే కొత్త శరీరం వచ్చేస్తుంది, కొంతమందికి ఆలస్యం అవుతుంది. పిల్లలకు పరీక్షల టైము ఎటువంటిదో ఈ జీవుడికి ప్రాణం పోయేటైము

అటువంటిది. మనస్సు గార్డు, ప్రాణం డ్రైవరు అని చెప్పారు. గార్డు జెండా ఊపితే కాని డ్రైవర్ బండిని కదపడు. ఇక్కడ మనస్సు పర్మిషన్ ఇవ్వాలి. ఈలోపుగా శరీరాన్ని విడిటపెట్టేయటానికి ప్రాణం కంగారుపడినా అలా వెళ్ళటానికి వీలులేదు. మీరు జీవితం పొడుగునా ఏ తలంపును అయితే చింతిస్తున్నారో అది శిరస్సులోనికి వచ్చాక గాని ప్రాణం పోదు. అయితే పునర్జన్మ ఎక్కడ రావాలి, ఏ కుటుంబంలో రావాలి అని అన్నీ ఇక్కడ నిర్ణయం అవుతుంది. ఆ నిర్ణయించే వాడినే ఈశ్వరుడు అంటారు.

చావటం, పుట్టటం ఇవి అన్నీ వ్యవహారం మాటలు. మనం చెప్పకొనే ఈ మాటలను భగవాన్ పట్టించుకోరు. ఈ శరీరం పుట్టటం, చనిపోవటం ఇందులోనుండి నీకు మేల్కొలుపు రావాలి. హృదయంలో ఉన్న సత్యం నీకు తెలిస్తే కాని ఈ జననమరణ ప్రవాహం నుండి నువ్వు విడుదల పొందలేవు, అదే నిజమైన మేల్కొలుపు. అందుచేత ఈ జన్మలను ఆయన పట్టించుకోరు. మీకు చాలా శరీరాలు వచ్చాయి, పోయాయి. అందులో ఏ శరీరం నీది? అందుచేత ఈ శరీరాల గొడవ వద్దు. ఏ వస్తువుకైతే చావులేదో, ఏ వస్తువుకైతే పుట్టుకలేదో, దేని స్వరూపం సుఖమో, దేని స్వరూపం శాంతో, దేని స్వరూపం సర్వకాల సర్వావస్థలలో ఉండటమో అది నీకు అనుభవైకవేద్యం అవ్వటమే జ్ఞానం. కొంతమంది నీటిమీద నడిచే వాళ్ళు ఉన్నారు, మహిమలు చేసేవాళ్ళు ఉన్నారు. ఇదంతా జ్ఞానం కాదు. ఏదైతే ఉందో అది మీరై ఉన్నారు. అది మీకు అనుభవంలోనికి రావాలి. అది జ్ఞానం. మీలో మార్పు వస్తూ ఉంటే, మీకు మనోవినాశం కలుగుతూ ఉంటే ఈ మనుషులపట్ల, సంఘటనలపట్ల, బాహ్యవస్తుజాలం పట్ల నీ దృక్పథం మారిపోతుంది. నీకు జ్ఞానోదయం అయ్యేకొలది వ్యక్తిభావనతో సంబంధం లేకుండా, ఇది నేను చేస్తున్నాను, నావల్ల అవుతోంది అనే భావన లేకుండా సహజంగా అన్నీ జరిగిపోతూ ఉంటాయి. దైనందిన జీవితంలో మనం చెయ్యవలసిన పని మనం మానకూడదు, నిషిద్ధ కర్మ చేయకూడదు.

శ్రద్ధ, సహనం విడిచిపెట్టవద్దు అని బాబాగారు చెప్పేవారు. ఆయన జీవితం పొడుగునా అదే బోధించారు. అంటే శ్రద్ధ వల్ల జ్ఞానం కలుగుతుంది. భాగవతాన్ని, రామాయణాన్ని అధ్యయనం చేయమని చెప్పేవారు. రామాయణంలో మాటలు ఎలా ఉంటాయి అంటే రాముడు మందాకినీ నదిలో రోజుకు మూడుసార్లు స్నానం చేసేవాడు. ఈ నదిలో నీళ్ళు ఇంత స్వచ్ఛంగా ఉన్నాయి ఏమిటి అని ఒకసారి సీతమ్మ అంది. నువ్వు చెప్పింది రైటే. చాలా స్వచ్ఛంగా ఉన్నాయి, సత్పురుషుడి హృదయంలా ఉన్నాయి అన్నాడు రామచంద్రమూర్తి. అటువంటి

హృదయం వస్తేనే మనకు సత్యం అనుభవంలోనికి వస్తుంది. అంటే నీ హృదయం అంత స్వచ్ఛం అయినప్పుడు లోపల ఉన్న సత్యం నీకు ఎరుకలోనికి వస్తుంది. అది నీచేత తెలియబడేదికాదు. నువ్వు చేసే ప్రయత్నం చేస్తావు. చివరి నిమిషంలో ఈశ్వరుని దయకూడా ఉండాలి. చివరిదాకా వెళ్లి ఒకోసారి మనం ఫెయిల్ అవ్వవచ్చు. కాని మనం చేసిన కృషి ఊరికే పోదు. తరువాత జన్మలో కంటిన్యూ అవుతుంది. నువ్వు చేసిన సాధనా బలాన్ని బట్టి, నీకు ఉన్న సహృదయాన్ని బట్టి, నీకు ఉన్న సద్బుద్ధిని బట్టి అది ఎప్పడయితే తెలియబడాలి అనుకొంటుందో ఆ క్షణంలో మాత్రమే నీకు తెలియబడుతుంది. ఈ లోపు నువ్వు చేసే ప్రయత్నం చేయవచ్చు . కాని ఫలితం ఈశ్వరుడి చేతిలో ఉంది. బ్రహ్మంకు నీపట్ల అనుగ్రహం కలిగినప్పడే అది నీకు తెలియబడుతుంది. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం అంటే మీరు ప్రయత్నం మానకూడదు. కాలం కలిసిరావాలి. రేపు జరగవలసింది రేపే జరుగుతుంది కానీ మీరు కంగారు పడ్డారని ఈ రోజు జరిగిపోదు. ఏది ఎప్పడు ఎక్కడ ఎలా జరగాలో అలా ఈశ్వర నిర్ణయం ప్రకారం జరుగుతూ ఉంటుంది. పని మీ చేతిలో ఉంది, దాని తాలూక ఫలితం ఎప్పడు యివ్వాలో ఈశ్వరుడు నిర్ణయిస్తాడు. మీరు ఈశ్వరుని పాదాలు విడిచిపెట్టకుండా సత్యాన్వేషణలో ఉంటే అది ఎప్పడు ఎరుకపడాలో అప్పడు మీకు ఎరుకపడుతుంది. అది మీ చేత తెలియబడేది కాదు, అది మీకు ఎరుకలోకి రావాలి. భగవాన్‌కు మరణానుభవం ద్వారా మరణంలేని స్థితి ఆయనకు అనుభవంలోనికి వచ్చింది. ఆయన ప్రయత్నం ఏమైనా చేసారా అంటే ప్రయత్నం ఏమీ కనబడదు. ఆయనకు జ్ఞానోదయం అయ్యేకాలం వచ్చింది, ఆ కాలానికి అది జరిగింది. ఆ టైములో వస్తుందని ఆయనకూ తెలియదు. అది ఈశ్వరనిర్ణయం. మాకు జ్ఞానం యివ్వండి అని ఎవరయినా భగవాన్‌ను అడిగితే మరి నాకు ఎవరు ఇచ్చారు. నాకు ఎవరు యిచ్చారో మీకు కూడా ఆయనే జ్ఞానం ప్రసాదిస్తాడు. అంతా ఈశ్వరుడే. ఒకవేళ మీరు ప్రయత్నం చేస్తున్నా ఆయన అనుగ్రహం లేకుండా ఏదీ పొందలేరు. శివరాత్రి రోజున, ముక్కోటి ఏకాదశి రోజున తప్పనిసరిగా ఉపవాసం ఉండాలి అని చెపుతారు. ఉప, వాసం అంటే మీహృదయంలో ఉన్న పరమేశ్వరుడికి సమీపంలో ఉండాలి, సన్నిహితంగా ఉండాలి. ఈ రోజున నిరాహారం మంచిది అని పరమాచార్య చెప్పారు. శివానుగ్రహం ఉంటే జ్ఞానం వస్తుందని, మహావిష్ణువు అనుగ్రహం ఉంటే మోక్షం వస్తుందని చెపుతారు. జ్ఞానం అన్నా, మోక్షం అన్నా ఒక్కటే.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# శ్రీ శంకర భగవత్పాదులు

జీవకోటిని జననమరణ సంసారచక్రం నుండి విముక్తులను చెయ్యడానికి పరమ శివుడే జగద్గురువు శంకరాచార్యుని రూపంలో అవతరించాడని అంటారు. శంకరుడు అంటే నిత్యసుఖాన్ని ప్రసాదించేవాడు. క్రీ॥శ॥ 788 సం॥లో కేరళలోని, పూర్ణా నదీ తీరంలోని, కాలడి గ్రామంలో శ్రీ శివగురువు, ఆర్యాంబ పుణ్యదంపతులకు వర ప్రసాదంగా శరీరాన్ని ధరించి, తన 32వ ఏట కేదార్‌నాథ్‌లో శరీరాన్ని విసర్జించారు. ఆయనకు ఎనిమిది సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికి అన్ని శాస్త్రాలు నేర్చుకున్నారు. శంకరుల గురువు గోవింద భగవత్పాదులు. కేవలం బోధస్వరూపుడైన ఆదిశంకరులు అనేక భాష్యగ్రంథాలు, కారికలు, స్తోత్రగ్రంథాలు రచించారు. ఆయన జ్ఞానభాస్కరుడు, దేశమంతా కాలి నడకను తిరిగి జ్ఞానబోధ చేసారు. ఆయన ఆస్థి, సొత్తు అద్వైతజ్ఞానం. జగజ్జీవేశ్వరుల అభేదత్వాన్ని ప్రతిపాదించారు. శాశ్వత దుఃఖనివృత్తికి వాస్తవంగా తాను ఎవరో? అనుభవైక వేద్యం చేసుకోవడమే తరుణోపాయంగా సూచించారు. వారు తమ రచనలలో తత్త్వజ్ఞానప్రాప్తికి ఆచరించవలసిన పద్ధతులను సూచించారు. శంకరులు తన బ్రహ్మానుభూతికి, ప్రపంచానుభూతిని, పాండిత్యమును జోడించి మనకు బోధచేసారు. శంకరులు తమ రచనలలో బ్రహ్మము యొక్క సత్యత్వము గురించి, జగత్తు యొక్క మిధ్యాతత్త్వము గురించి, జీవాత్మ పరమాత్మల అభేదత్వము గురించి, సాధన సంపత్తి గురించి, బంధ మోక్షముల గురించి వివరించారు. శ్రీ శంకరుల బోధ మానవులను సంసార సాగరం నుండి తరింపజేసే నౌకగా అలరారుతూ, సకల దుఃఖాలనూ పోగొట్టి, స్వరూపశాంతిలోకి మేల్కొలుపుతోంది. శ్రీ శంకరభగవత్పాదులు రూపుదాల్చిన అద్వైత మూర్తిగా నిలిచి, వేదాంతసారాన్ని అనేక కోణాలలో వివరించి, లోకంలో శాంతిని నెలకొలిపారు. తాను జీవించియున్న కొద్దికాలంలో మానవాళికి శంకరులు చేసిన బోధ మరియు రచనలు అసమాన్యం. అందువల్లనే గురుపరంపరలో పరమపూజ్యునిగా, జగద్గురువుగా నిరంతరం పూజలందుకుంటున్నారు.

**(ది॥ 11-05-2016 శ్రీ శంకర జయంతి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ద్వితీయంలేనిదే - అద్వైతం

ఏది ఉందో అదే దైవం. ఉనికిలో ఆయన భాగం కాదు. ఆయనే స్వయంగా ఉనికి సృష్టి ఆయన సొంతం కాదు. స్వయంగా సృష్టీ ఆయనలో ఉంది. ఏపేరు, ఏరూపం లేనివాడే దైవం. దైవం ప్రతీ ఒక్కరినీ పరివేష్టిస్తున్నాడు, కాని ఆయన ఎరుక మనకు తెలియటంలేదు. అచేతనత్వంలోనే మనం ఉన్నాము. అందువల్ల ఆయన అనుభవం తెలియటంలేదు. భగవత్గీతసారం "ఉన్నది ఏదో ఉన్నది లేనిది ఏదోలేదు ఉన్నదాన్ని నీవు లేదనుకొన్న లేకపోవటం జరగదు. లేనిది నీవు ఉందనుకొన్న ఉండదు ఇది నిశ్చియం" అన్నారు. శ్రీనాన్నగారు "శంకరులు ఈ లోకం నిజమని ఎందుకు అనలేదు అంటే నిజమంటే నిన్ను రంపం పెట్టికోసినా నీ మనస్సులో పలికి వెళ్లదు. నిన్ను నీవు చూచుకొంటే లోకం నీకు భిన్నంగా లేదని గ్రహిస్తావని అర్థం" అన్నారు. ఈ ప్రపంచంస్వప్నం నుండి మేలుకొన్నవానికి మిగిలింది ఎరుకే అదే అద్వైతం. అసంఖ్యాకంగా చూచే దృష్టేద్వైతం. చూస్తున్నాను అని చెప్పటం కూడా ద్వైతమే. అద్వైతం కంటితో చూచేదికాదు. గురుముఖితా శాస్త్రం యొక్క మూలాన్ని శ్రద్ధతో తెలుసుకొని అనుభవించిందే అద్వైతం. బేధబుద్ధి ఉన్నంతకాలం దుఃఖం ఉంటుంది. రెండవ వస్తువు ఉందనుకొంటే మనస్సుకు ప్రీతి. వస్తుప్రీతితో సుఖం, వస్తువియోగంతో దుఃఖం తప్పదు. భేదం కొంచెంగా ఉన్న భయం ఉంటుంది. భేధరహితంగా ఉన్నప్పుడు కొంచెమైనా భయం ఉండదు అని పెద్ధలు చెబుతారు. మనసాధనలో దైవంరూపంగా దర్శనమియ్యవచ్చు అది యదార్ధంకాదు. "ముక్తిమార్గంలో మీకు దైవం రూపంగా ఎదురైనా మీదారిలోంచి అతణ్ణి తొలగించండి" అన్నారు రింజాన్. ఆత్మ సాయంతోనే మనస్సు చూస్తుంది కనుక మనస్సు ఆలోచిస్తుంది అనుటవల్ల అది దేని సాయంతో చూస్తుందో అదే సత్యం. పరిమితి తత్వం మూడు విధాలుగా ఉంటుంది. కాల సంబంధమైనది స్థలసంబంధమైనది, నిమిత్తసంబంధమైన పరిమితతత్వం రెండవది ఎక్కడ కనబడదో, రెండు వినబడదో, ఎక్కడ రెండవ జ్ఞానం కనబడదో అక్కడే పూర్ధత్వం అఖండత్వం ఉంది. భగవాన్ కాలం మీద, అవస్ధల మీద దృష్టి సారించారు. విషయాన్ని సూటిగా స్పష్టంగా చెప్పారు. వారి సమాధానాల్లో గమ్యమే వారి వారి దృష్టి పరిధిలో ఉండేది. భగవాన్తో ఒకరు "నాకు కృష్ణుడు అప్పుడప్పుడూ కనిపిస్తున్నాడు" అంటే అప్పుడప్పుడు కనిపించే దైవం కావాలా నిత్యం నీతో ఉండే దైవం కావాలా" అన్నారు. ఎందరో మహానుభావులు, సంఘసంస్కర్తలు ఈ లోకంలో అవతరించారు. మహాత్ములు, సద్గురువు ఈ లోకాన్ని స్వర్గధామం చెయ్యటానికి రారు. మనలను ప్రాపంచిక బంధనాలనుండి విముక్తి కలిగించి మళ్లీ జన్మప్రాప్తించకుండా ఉండే మార్గాన్ని ప్రవచిస్తారు, నడిపిస్తారు. ఈ అవకాశాన్ని పుణ్యం పండిన వాళ్ళు, శ్రద్ధాళు వులు మాత్రం అందిపుచ్చుకొని తరిస్తారు. అది అంతా ప్రకృతిప్రణాళికంగా ఉంటుంది. మనం అద్వైతబోధ సారమనే చెప్పులు తొడుగుకొంటే ఈ ప్రంపంచంలో ప్రకృతిముళ్ళు ఏమీ చెయ్యలేవు. మనం మహోన్నతస్థితికి చేరి శాశ్వతశాంతిని పొందుతాము. భగవంతుడు లోపల, బయట అన్నిటా ఉన్నాడనే అనుభవం కలిగినప్పుడు మాత్రమే మానవుడి జీవితం యొక్క వాస్తవమైన ధ్యేయం పూరింపబడుతుంది. ఆయనే మనం ఆయనే ఈ విశ్వం అనే నిజధామానికి చేరిపోతాము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966